నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
8 | సోమవారం 13 మే 2024 | MAHABUBABAD

## బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ

**కాంగ్రెస్‌కు మూడో స్థానమే**
**వరంగల్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమైంది**
**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, మే 12: పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ గెలుపు ఖాయమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తంచేశారు. జనగామ జిల్లా దేవరుప్పులలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్ లోక్‌సభ స్థానంలో బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని, కాంగ్రెస్ అభ్యర్థి మూడో స్థానానికి పరిమితం అవుతారని జోస్యం చెప్పారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్‌కు మెజార్టీ ఓట్లు వస్తాయన్నారు. దీనికి కారణం బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ అందించిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలేనన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వాటిని నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ హామీలు మోసపూరితమని గ్రహించిన ప్రజలు ఉద్యమ నేత కేసీఆర్‌ను ఆదరిస్తున్నారని, కారు గుర్తుకు ఓటేస్తామని బాహాటంగా చెబుతున్నారని ఎర్రబెల్లి వివరించారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించి కేసీఆర్‌ను మోసం చేసిన వారని, వారికి ప్రజలు గుణపాఠం చెబుతారని అభిప్రాయపడ్డారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎర్రబెల్లి విజ్ఞప్తి చేశారు.




జనగామ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద పోలింగ్ సామగ్రితో సిబ్బంది

### మహబూబాబాద్ బరిలో 23 మంది..

మహబూబాబాద్, మే 12(నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ లోకసభ పరిధిలో ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇక్కడ 23మంది అభ్యర్థులు బరిలో ఉండగా మొత్తం 15,32,366 మంది ఓటర్లు ఉన్నారు. 7,84,424 మహిళలు, 7,47,836 మంది పురుషులు, 106 మంది ఇతరులు ఉన్నారు. 1,809 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో 317 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు, ములుగు, ఇల్లెందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. 8,683 మంది పోలింగ్ సిబ్బంది, సుమారు 6వేల మంది పోలీసులు, మరో 1,500 మంది కేంద్ర బలగాలను కేటాయించారు. మహబూబాబాద్ లోక్‌సభ బరిలో 23 మంది అభ్యర్థులు ఉండగా, బీఆర్ఎస్ తరపున మాలోత్ కవిత, కాంగ్రెస్ నుంచి బలరాంనాయక్, బీజేపీ తరపున సీతారాంనాయక్ పోటీలో ఉన్నారు.

# ఓట్ల పండుగ నేడే





## లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధం

- వరంగల్, మహబూబాబాద్ సెగ్మెంట్లలో అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు తరలిన యంత్రాంగం
- ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6వరకు పోలింగ్
- సమస్యాత్మక ప్రాంతాల్లో 4గంటల వరకే..
- వరంగల్ బరిలో 42, మానుకోటలో 23మంది అభ్యర్థులు
- మొత్తం ఓటర్లు 33,56,832
- పోలింగ్ కేంద్రాలు 3709

ఓట్ల పండుగకు వేళయ్యింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సోమవారం పోలింగ్ జరుగనుండగా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల పరిధిలో మొత్తం 3709 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయగా ఆదివారం సాయంత్రంలోపు ఎన్నికల సామగ్రితో సిబ్బంది పోలింగ్ సెంటర్లకు చేరుకున్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటలకు పోలింగ్ కొనసాగనుండగా, భూపాలపల్లి, ములుగు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో 4గంటలకే ముగియనుంది. వరంగల్ నుంచి 42మంది, మానుకోట నుంచి 23మంది అభ్యర్థులు బరిలో నిలువగా, రెండు చోట్ల కలిపి మొత్తం 33,56,832 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ప్రత్యేకంగా దివ్యాంగ, మహిళ, మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. - వరంగల్, మే 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

### వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ వివరాలు..

| | | |
|---|---|---|
| మొత్తం ఓటర్లు | : | 18,24,466 |
| పురుష ఓటర్లు | : | 8,95,421 |
| మహిళా ఓటర్లు | : | 9,28,648 |
| ఇతర ఓటర్లు | : | 397 |
| పోలింగ్ కేంద్రాలు | : | 1,900 |



సిబ్బందికి సూచనలు చేస్తున్న వరంగల్ ఆర్వో ప్రావీణ్య

### వరంగల్ లోక్‌సభ బరిలో 42 మంది

వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లో 42 మంది పోటీ పడుతున్నారు. పోటీ ప్రధానంగా బీఆర్ఎ స్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే ఉన్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పదేండ్ల పాలనపై, రాష్ట్రంలో ఐదు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్రంగా ఉన్న అసంతృప్తి బీఆర్ఎస్‌కు సానుకూలంగా మారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పదేండ్ల పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు మధ్య తేడాను ప్రజలను గమనించారని, పోలింగ్ సరళి తమకు అనుకూలంగా ఉంటుందని బీఆర్ఎస్ ఆశాభావంతో ఉన్నది. బీఆర్ఎస్ తరపున డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్, కాంగ్రెస్ నుంచి డాక్టర్ కడియం కావ్య, బీజేపీ తరపున అరూరి రమేశ్ పోటీలో ఉన్నారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి అగ్రనాయకులు వచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన రోడ్ షోకు అనూహ్య స్పందన వచ్చింది. బీజేపీ అభ్యర్థి తరపున ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి తరపున సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో పాల్గొన్నారు. వరంగల్ నగరంలో రోడ్ షో నిర్వహించారు.



వరంగల్‌లో అభ్యర్థుల జాబితాను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది



మహబూబాబాద్‌లో పంపిణీ కేంద్రం వద్ద సూచనలిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



భూపాలపల్లిలో ఎన్నికల సామగ్రి తీసుకెళ్తూ..

వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, పరకాల, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో దివ్యాంగ, మహిళ, మోడల్ పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, పరకాల, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్లలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని 1,900 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, వీవీప్యాట్లతో సిబ్బంది తరలివెళ్లారు. 2,126 మంది పీవోలు, 2,126 మంది ఏపీవోలు, 4,342 మంది ఓపీవోలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వరంగల్ పశ్చిమ, పరకాల, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలకు ఎనుమాముల మార్కెట్ యార్డులో, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు సమీపంలోని కేంద్రాల్లోనే పంపిణీ ప్రక్రియను పూర్తి చేశారు. పోలింగ్ అనంతరం ఏడు సెగ్మెంట్లలోని ఈవీఎంలను ఎనుమాములలోని గోడౌన్‌లో భద్రపరచనున్నారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగనున్నది.



ములుగు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది





మహబూబాబాద్‌లో ..

### వరంగల్ లోక్ సభ పరిధిలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు..

| అసెంబ్లీ సెగ్మెంట్ | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| ఘన్‌పూర్(స్టేషన్) | 295 | 1,25,210 | 1,28,898 | 02 | 2,54,110 |
| పాలకుర్తి | 296 | 1,26,411 | 1,29,090 | 13 | 2,55,514 |
| పరకాల | 239 | 1,08,076 | 1,14,305 | 02 | 2,22,383 |
| వరంగల్ పశ్చిమ | 244 | 1,39,322 | 1,44,108 | 16 | 2,83,446 |
| వరంగల్ తూర్పు | 230 | 1,25,638 | 1,32,518 | 339 | 2,58,495 |
| వర్ధన్నపేట | 279 | 1,34,257 | 1,39,491 | 18 | 2,73,766 |
| భూపాలపల్లి | 317 | 1,36,507 | 1,40,238 | 07 | 2,76,752 |
| మొత్తం | 1900 | 8,95,421 | 9,28,648 | 397 | 18,24,466 |

## ఇద్దరు ఎన్నికల అధికారులకు తీవ్ర అస్వస్థత

### ములుగు దవాఖానకు తరలింపు





చికిత్స పొందుతున్న స్వామి, నీలయ్య

ములుగురూరల్, మే 12 : ఎన్నికల్లో విధులు నిర్వర్తించేందుకు వచ్చిన ఇద్దరు అధికారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. వెంకటాపూర్‌లో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కామారెడ్డి జిల్లావాసి స్వామి, మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన నీలయ్య ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రానికి చేరుకున్నారు. ఈ క్రమంలో స్వామి ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోవడంతో కన్ను, నోటికి తీవ్ర గాయాలయ్యాయి. నీలయ్య సైతం అస్వస్థతకు గురి కాగా అక్కడ విధుల్లో ఉన్న అధికారులు ఇద్దరినీ ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్యం అందించారు.

**జ్వరం వస్తున్నదన్నా వినలేదు**

వారం రోజుల నుంచి తనకు తీవ్ర జ్వరం ఉన్నదని తాను విధులకు హాజరు కాలేనని అధికారులకు తెలుపగా ఏటూరునాగారంలో విధులు నిర్వర్తించాలని అన్నారని నీలయ్య తెలిపారు. లేకుంటే సస్పెండ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారని, చేసేదేమీ లేక విధులకు హాజరయ్యేందుకు రాగా కళ్లు తిరిగి పడిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. వాంతులు, విరేచనాలు అవుతున్నాయని కంటతడిపెట్టారు. కాళ్లు మొక్కుతా, దండం పెడుతా తనను ఇంటికి పంపించండి అంటూ మీడియా ద్వారా నీలయ్య ఉన్నతాధికారులను వేడుకున్నాడు.

## పస్రాలో మోడల్ పోలింగ్ స్టేషన్



పస్రానాగారం పోలింగ్ కేంద్రంలో తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రం

గోవిందరావుపేట, మే12 : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా నాగారం ప్రభుత్వ పాఠశాలలో అధికారులు మోడల్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు పస్రాలోని పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఓటర్లకు స్వాగతం పలుకుతూ రెడ్ కార్పెట్‌తో పాటు ఓటర్ల కోసం ప్రత్యేకంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. అంతేకాకుండా గదుల్లో కూడా ప్రత్యేక వసతులు కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పస్రా సీఐ శంకర్, ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేశారు.

# జోరు వాన

- ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా ఈదురు గాలులతో వర్షం
- నిలిచిన విద్యుత్ సరఫరా..
- పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు పడిన సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో ఆదివారం రాత్రి జోరు వాన కురిసింది. ములుగు, ఏటూరునాగారం, వాజేడు, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, చిల్పూర్, జఫర్‌గఢ్, వరంగల్ నగరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. అక్కడక్కడా చెట్లు కూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ వద్ద వేసిన టెంట్లు గాలిదుమారానికి కూలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు విశ్వప్రయత్నం చేశారు. - నమస్తే నెట్‌వర్క్, మే 12



ములుగులో కురుస్తున్న వర్షం



ఏటూరునాగారంలో విరిగిపడిన చెట్టు



వరంగల్ నగరంలో జలమయమైన ములుగు రోడ్డు



స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో వర్షానికి తడిసిన టెంట్

## పోలింగ్ సాఫీగా సాగేలా చూడాలి

**వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య**
**కేంద్ర ఎన్నికల పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్‌చంద్‌తో కలిసి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన**

కాశీబుగ్గ, మే 12 : పోలింగ్ సాఫీగా సాగేలా చూడాలని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఆదివారం ఎనుమాముల మార్కెట్ యార్డులో జరిగిన ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్‌తో కలిసి ప్రావీణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల విధులు పక్కాగా నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు రూట్‌మ్యాప్ ఆధారంగా పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన బస్సుల్లో ఎన్నికల సామగ్రిని తీసుకెళ్లారని, ప్రతి బస్సుకు పోలీసులు ఎస్కార్ట్‌గా వెళ్లారన్నారు. ఏఆర్వోలు అశ్వినీ తానాజీ వాకడే, సిదం దత్తు, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, విజయ్ సాగర్ పాల్గొన్నారు.